క్లుప్తంగా

రామాలయానికి సౌండ్ సిస్టం వితరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంనగర్‌లో గల రామాలయానికి సౌండ్ సిస్టంను రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజినీష్ కిరాడ్ అందించారు. ఇటీవలే రామాలయంలో సౌండ్ సిస్టం చెడిపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజినీష్‌ను కోరగా ఆయన వెంటనే స్పందించి సౌండ్ సిస్టం ఆలయానికి అందజేశారు. ఆలయంలో సౌండ్‌సిస్టం ఎప్పుడు ఏ సమస్య వచ్చిన ఉచితంగా రిపేర్ చేయిస్తామన్నారు. ఈసందర్భంగా రజినీష్ కిరాడ్‌ను ఆలయ కమిటి సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొక్కుల లింగం, కార్యదర్శి రాస ఆనంద్, కోశాధికారి పిట్ల శశిధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన ఎం. జయవంత్ ఇటీవల ప్రమాదానికి గురి కాగా, హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)ని మంజూరు చేయించారు.

ఆరోగ్య విస్తరణాధికారి బదిలీ



కోటగిరి(రుద్రూర్): కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణాధికారి గోవర్ధన్ నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డివిజన్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గోవర్ధన్ ఐదున్నర ఏళ్లు మండల హెచ్‌ఈవోగా సమర్థంగా విధులు నిర్వర్తించారు. జిల్లా వైద్యశాఖ నుంచి వచ్చిన ఆదేశాలను తూచ తప్పకుండా పాటించారు. ఆరోగ్యం పట్ల ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల నిర్వహణలో అంకితభావంతో పని చేశారు. ఆరోగ్య ఉపకేంద్రాలు, వసతి గృహాలు, స్కూళ్లతో పాటు గ్రామాల్లో పర్యటించి వైద్య శాఖ సంబంధిత కార్యక్రమాలు చేపట్టి మండల ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

రుద్రూర్ హెచ్‌ఈవో మోర్తాడ్‌కు..

రుద్రూర్: రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో రాజేందర్ మోర్తాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. నవీపేట్ నుంచి శ్రీనివాస్ రుద్రూర్‌కు వచ్చారు. పోతంగల్ పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌లుగా పని చేస్తున్న జ్యోతి రుద్రూర్ పీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. ఇక్కడ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సావిత్రి పోతంగల్ బదిలీ అయ్యారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో పాత జాతీయ రహదారి–44పై బాల్కొండ ఎస్సై యాసర్ ఆరాఫత్ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే జరిమానా విధించారు. ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. హెడ్ కానిస్టేబుల్ జయంత్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

100కు కాల్ చేస్తే వెంటనే స్పందించాలి

రుద్రూర్: డయల్ 100కు కాల్ వస్తే వెంటనే స్పందించాలని రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి సూచించారు. సోమవారం రుద్రూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రైమ్ వివరాలు, పురోగతి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై అప్పారావ్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

చాగంటికి వేదపండితుల సన్మానం



బోధన్: పట్టణంలోని విజయ సాయి హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్రవచన కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వేదమూర్తులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావును బాసర సరస్వతీ పుణ్యక్షేత్రం వేదపండితులు, పట్టణ ఆలయాల అర్చకులు కలిసి ఘనంగా సన్మానించారు. బాసర వేదపండితులు ప్రవీణ్ పాఠక్, ప్రణవ్ శర్మ, ఆలయ ఈవో విజయ భాస్కర్, స్థానిక మారుతి మందిరం ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్ తదితరులున్నారు.

వెల్‌నెస్‌లో సౌకర్యాల లేమి

- వైద్యుల కొరత.. ఇరుకు గదుల్లో సేవలు
- రిటైర్డు ఎంప్లాయీస్, ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారుల



వెల్‌నెస్ సెంటర్‌లో ఒక గదిలోనే ఏర్పాటు చేసిన ఫార్మసీ.. మందుల స్టోరేజి



వెల్‌నెస్ సెంటర్ బయట మందుల కోసం క్యూలో ఉన్న రోగులు (ఫైల్)

నిజామాబాద్ నాగారం: రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఉద్యోగులు తదితరులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిజామాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ మరీ ఇరుకుగా మారింది. ఒకే ఒక్క హాలులో ఫార్మసి, స్టోర్ రూమ్‌తో పాటు వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. స్పెషలిస్టు డాక్టర్లు ఉండాల్సి ఉన్నా.. కేవలం ఎమ్‌బీబీఎస్ వైద్యులతోనే తూతూ మంత్రంగా నడిపిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వెల్‌నెస్ సెంటర్ సేవలు అందుతున్నాయి. ఉభయ జిల్లాలకు సంబంధించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు వేలాదిమందికి ఉపయోగపడుతున్న వెలెనెస్ సెంటర్‌కు వసతి కరువైంది. ఒకే రూములో డాక్టర్లు, మందులు ఇవ్వడం, రిజిస్ట్రేషన్, లబ్ధిదారులు కూర్చునేందుకు, తదితర పనులు ఒకే చోట నిర్వహించటం చాలా ఇబ్బందిగా మారింది. పేషెంట్లు వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కూర్చునేందుకు కూడా స్థలం లేక సగం మంది బయటే కూర్చోవడం లేదా తిరగటం జరుగుతోంది.

స్పెషలిస్ట్ డాక్టర్లు ఎక్కడ?

నిబంధనల ప్రకారం వెల్‌నెస్ సెంటర్‌లో అవుట్ పేషెంట్ సేవల గురించి స్పెషలిస్ట్ డాక్టర్లు ఉండాలి. కార్డియాలజీ, ఆర్థో, గైనకాలజీ, న్యూరో, చిల్డ్రన్ స్పెషలిస్ట్ తదితరులతో పాటుగా ఎంబీబీఎస్ డాక్టర్లు ఉండాలి. కానీ ఒక్క డాక్టర్‌తోనే వందలాది మందికి సేవలు అందిస్తున్నారు. డెంటల్ ఎక్విప్మెంట్, కుర్చీలు, అన్ని మూటగట్టి మూలనపడేశారు. దీనితో డెంటల్ డాక్టర్లకు పని లేకుండా పోయింది. ఫిజియోథెరపీకి సంబంధించిన ఎక్విప్మెంట్ కూడా మూలన పడింది. ఈసీజీ పరిస్థితి కూడా అంతే. ఖరీదైన మందులు నిల్వ ఉంచడానికి అవకాశం లేకుండా పోయింది. మందులన్నీ ఎండకి ఎండుతున్నాయి. నిర్దేశించిన టెంపరేచర్‌లో మందులు ఉండాలి. పేషెంట్లు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఎండలోనే క్యూలో నిల్చుని మందులు తీసుకుంటున్నారు. ఇప్పుడు వర్షాకాలం వానలకు తడుస్తూ సేవలు పొందాల్సి వస్తోంది. డాక్టర్లు లేరు కానీ నాలుగో తరగతి సిబ్బంది మాత్రం పదుల సంఖ్యలో ఉన్నారు .

కమిషనర్ పర్యటించినా అంతే!

ఇటీవల మున్సిపల్ కమిషనర్ మంద మకరందు వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. ఎలాంటి సేవలు అందుతున్నాయో వైద్యులు, రిటైర్డు ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా మార్పు జరుగుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. సమస్యలతో ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని కమిషనర్ పరిశీలించడంతో న్యాయం జరుగుతుందని చూస్తున్నారు.

వసతి కల్పించాలి



పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపయోగపడుతున్న వెల్‌నెస్ సెంటర్ గురించి అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. వర్షాకాలంలో పేషెంట్లకు తలదాచుకోవటానికి కూడా అవకాశం లేకుండా పోయింది. స్వయానా మున్సిపల్ కమిషనర్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి గాలి కూడా సరిగా ఆడని పరిస్థితుల్లో ఎలా ఉంటున్నారు అని ప్రశ్నించారు. టాయిలెట్లు, బాత్రూములు కూడా సక్రమంగా లేవు. అదనపు వసతి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము.

– కె. రామ్మోహన్‌రావు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్

బస్సుల కోసం మహిళల పడిగాపులు



బస్సు కోసం ఎదురు చూస్తున్న మహిళలు

బాల్కొండ: ముప్కాల్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుల కోసం సోమవారం మహిళలు గంటల తరబడి పడిగాపులు కాశారు. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టినా తగినన్ని బస్సులు సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో మహిళలు గంటల తరబడి రోడ్డుపై నిలబడాల్సి వస్తోంది. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లటానికి బస్సులు లేక.. వచ్చినా నిండుగా జనంతో రావడంతో బస్సులను ఆపకుండానే వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక మహిళలు ఎండలో రోడ్డుపై ఉండిపోయారు. కొందరు మహిళలు ఆటోల్లో వెళ్లిపోయారు. ఉచిత బస్సు ప్రయాణం మాకొద్దు అనేలా బస్సు సౌకర్యం ఉంటుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాపాలన అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమేనా?



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్: సీఎం రేవంత్ రెడ్డి పదే పదే ప్రజా పాలన అని చెబుతున్నారు.. ప్రజలను ఇబ్బంది పెట్టడం, ప్రజలపై దాడులు చేయడమేనా ప్రజా పాలన అని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత ఆర్మూర్ మహేష్ అన్నారు. వారం రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు పట్టణ కేంద్రంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. గతంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించిన వారిని ఇప్పటికైనా అరెస్ట్ చేయకపోతే మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఆర్మూర్‌టౌన్: నందిపేట్ మండలం తల్వేదలో పెద్దన్నపై దాడి చేయించిన అవుల్దాపూర్ సాయిరెడ్డిని అరెస్టు చేయించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. భూమి విషయంలో మాదిగ కులానికి చెందిన పెద్దన్నపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన సాయరెడ్డిపై ఇంతవరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో దళితులపై రోజురోజుకు దాడులు జరుగుతున్నా, నిందితులను తప్పించే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారన్నారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన కుటుంబ సభ్యులతో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేత వెంకటేష్, న్యూ డెమోక్రసీ నేత దాసు, ఐఎఫ్‌టీయూ నేత సూర్య శివాజీ, తదితరులున్నారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి



కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దల్లా సురేష్

బోధన్: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడు దల్లా సురేష్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేష్ నాయకత్వంలో ఆగస్టు 10, 11 తేదీలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా తలపెట్టామని పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చలో ఢిల్లీ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పదేళ్లుగా వర్గీకరణపై నిర్లక్ష్యం వహించిందని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు మాదిగల విశ్వరూప సభలో మూడోసారి అధికారంలోకి రాగానే వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అఖిల పక్ష బృందంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మహాధర్నాకు మాదిగ, ఉపకులాల బంధువులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా, నియోజకవర్గ నాయకులు కనిగేకర్ గంగాధర్, పానుగంటి సాయిలు, బాషల సాయిలు, బాబు, కుమ్మన్‌పల్లి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎంపీలు ఒరగబెట్టింది ఏమీ లేదు'



ఆర్మూర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే బడ్జెట్ కేటాయింపుల్లో వారు ఒరగబెట్టింది మాత్రం ఏమీ లేదని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న ఆరోపించారు. ఆర్మూర్ డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణకు బడ్జెట్ కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు నరేష్, కుంట మంగ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి



ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో క్యూ కడుతున్న ప్రజలు

- అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు

ఆర్మూర్‌టౌన్: ఒకవైపు ఎడతెరిపిలేని వర్షాలు.. మరోపక్క పెరుగుతున్న దోమలతో ప్రజలు జ్వరం, ఒంటి నొప్పులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డులలో ప్రజలు దోమ కాటుకు గురవుతున్నారు. ప్రతిరోజు ఆర్మూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల తాకిడి పెరుగుతుంది. జ్వరం, జలుబు, టైఫాయిడ్‌తో పాటు తదితర వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏరియా ఆస్పత్రిలో అనారోగ్యంతో వస్తున్న ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్య, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దోమల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం, జలుబు, ఒళ్ళు నొప్పులు ఉంటే వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వేడిచేసి చల్లార్చిన నీటి ని తాగాలి. ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– రవికుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీలోకి తీసుకురావాలి



ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకువచ్చిన జీఎస్టీలోకి పెట్రోల్, డీజిల్‌ను కూడా చేర్చాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ కమిటీ అధ్యక్షుడు పెందోని అనిల్‌కుమార్ కోరారు. నగరంలోని ఆర్యనగర్‌లో సోమవారం ఇందూరు వినియోగదారుల సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే పన్ను విధానం అమలులో ఉండాలని జీఎస్టీని తీసుకురావడంతో రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలకు వర్తింప చేయడం లేదన్నారు. సెప్టెంబర్‌లో జరిగే వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ఈవిషయమై తీర్మానం ఆమోదం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. కమిటీ ప్రతినిధులు ప్రవీణ్, వర్మ, గైని రత్నయ్య, మహాదేవుని శ్రీనివాస్, గడప రవికుమార్, సాయి రెడ్డి, బానోత్ సందీప్, ప్రవళికగౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

సరస్వతి విద్యా మందిర్‌లో బోనాల పండుగ



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో సోమవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలో, ఉపాధ్యాయ బృందంతో కలిసి ఊరేగింపుగా బయలు దేరి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రాస రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పవిత్ర పుణ్యక్షేత్రం నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ



అర్చకులు ఆలయంలో గల లింగానికి పంచామృతంతో అభిషేకం చేశారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ చేశారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హాజారి సతీష్, ప్రశాంత్‌గౌడ్, చరణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్ కొత్త మోడల్ బైక్‌ల ఆవిష్కరణ



బోధన్: పట్టణ కేంద్రంలోని లక్ష్మి టీవీఎస్ బైక్ షోరూంలో సోమవారం కంపెనీ విడుదల చేసి టీవీఎస్ రెండు కొత్త మోడల్ అపాచీ బైక్‌లను మున్సిపల్ చైర్మన్ తూము పద్మాశరత్‌రెడ్డి ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కొత్త మోడల్ ప్రత్యేకతలు, ధరలను కంపెనీ ప్రతినిధులు వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, టీవీఎస్ కంపెనీ మేనేజర్ కె.రవికుమార్, ఫైనాన్స్ మేనేజర్ శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గల్లీ గ్యాంగ్‌స్టార్ (తెలుగు) - 12.40, పురుషోత్తముడు - 4.00, 7.10, ఆపరేషన్ రావణ్ (తెలుగు) - 10.20
స్క్రీన్-2 –	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-3 –	రాయన్ (తెలుగు) - 01.00, 4.10, 7.20, 10.30
స్క్రీన్-4 –	రాయన్ (తెలుగు) - 11.20 కల్కి 2898 ఏడీ (తెలుగు) - 2.30, 6.15, 10.00

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ మోసం



మాట్లాడుతున్న దుద్దు గంగాధర్

మాక్లూర్: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల్ని మోసం చేసిందని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దుద్దు గంగాధర్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు అధికారంలోనికి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామంటూ గొప్పలు చెప్పి రైతుల ఓట్లు దండుకున్న తర్వాత మాట తప్పారని అన్నారు. కేవలం పావు వంతు రైతులకే అరకొరగా రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. లేనిచో తాము రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

నేడు సీఎం దిష్టిబొమ్మ దహనం

కొందరు రైతులకే రుణమాఫీని వర్తింపజేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామావత్ సురేష్ నాయక్ సోమవారం తెలిపారు. బీజేపీ రైతు విభాగ ఆధ్వర్యంలో జరిగే ఈ ఆందోళన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఎదుట చేపడుతున్న ధర్నాకు బీజేపీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, వివిధ మోర్చా, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

రుద్రూర్: డిమాండ్ల సాధనకు మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి రావాలని మండల ఆశావర్కర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిమాండ్లతో కూడిన నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో భూలక్ష్మీ, వాణి, ప్రమీల, లక్ష్మీ తదితరులు ఉన్నారు.